సాక్షి శ్రీకాకుళం

గురువారం । 10 । అక్టోబర్ । 2024



ఇదేం న్యాయం..?

తమను ఉద్యోగాల నుంచి తొలగించడంపై 31 మంది ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆందోళనలు చేస్తున్నారు. - IIలో



పనిచేయని స్కానింగ్ మిషన్

నరసన్నపేట ప్రభుత్వాస్పత్రిలో స్కానింగ్ మిషన్ పనిచేయడం లేదు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. - IIలో

రాష్ట్ర చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి అండర్-15 చెస్ పోటీలకు ఐదుగురు క్రీడాకారులు ఎంపిక య్యారు. ఎంపికైనవారిలో జి.అశ్రితరామ్, బి.జీవన్, ఎస్.యశ్వంత్, కె.జశ్వంత్, రిత్విక్ ఉన్నారు. బుధవారం శ్రీకాకుళంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ ఎంపికల్లో వీరు రాణించడంతో రాష్ట్రపోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా చెస్ సంఘ అధ్యక్షుడు బగాది కిషోర్ తెలిపారు. గుంటూరు వేదికగా ఈనెల 15 నుంచి 17 వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని ఆయన చెప్పారు.

న్యూస్‌రీల్

గంజాయిని నియంత్రించాల్సిందే

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో జూమ్ మీటింగ్ నిర్వహించగా విశాఖపట్నం రేంజి పరిధిలోని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలతో పాటు శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వర రెడ్డి కూడా పాల్గొన్నారు. దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లు, లైసెన్సులు తనిఖీ చేయాలన్నారు. గత సైబర్ కేసుల్లో బ్యాంకు అకౌంట్లలో ఫ్రీజ్ అయిన నగదు బాధితులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

కొవ్వాడ నిర్వాసిత కాలనీ పనులపై దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ధర్మవరం వద్ద నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి సంబంధిత అధికారులతో బుధవారం మధ్యాహ్నం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. అప్రోచ్ రోడ్డు పెండింగ్ పనులపై, నిర్వాసితులకు చెల్లించాల్సిన పెండింగ్ నష్ట పరిహారాలపై చర్చించారు. ప్రాజెక్టుకు అటవీ శాఖ తరఫు నుంచి వస్తున్న అడ్డంకుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను పరిష్కరించేందుకు నివేదికలు తయారు చేయాలని, ఉన్నతాధికారులకు నివేదించి సత్వర పరిష్కారాన్ని కనుగొనాలని స్పష్టం చేశారు.

తిత్లీ విధ్వంసానికి ఆరేళ్లు



ఉద్దానంలో నేలమట్టమైన తోటలు (ఫైల్)

కాశీబుగ్గ: తిత్లీ విధ్వంసానికి ఆరేళ్లు పూర్తయ్యాయి. పలాస నియోజకవర్గ సముద్రం తీరంలో ప్రారంభమైన తిత్లీ తుఫాన్ సమస్త ఉద్దాన ప్రాంతాన్ని తుడిచిపెట్టేసింది. కొబ్బరి, జీడిమామిడి, మామిడి, ఉద్యాన పంటలు నేలమట్టమయ్యాయి. పశుపక్ష్యాదులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

'మద్యం' దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

శ్రీకాకుళం క్రైమ్ : మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు రోజుల పాటు గడువు పెంచింది. ఈ మేరకు నగరంలోని 80 అడుగుల రోడ్డు సమీపంలో ఉన్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ (ఇన్‌చార్జి ఏసీ) దోసకాయల శ్రీకాంత్‌రెడ్డి బుధవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11 రాత్రి ఏడు గంటల వరకు దరఖాస్తులు స్వీకరణ ఉంటుందని, 14 ఉదయం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో డ్రా తీసి మద్యం లైసెన్సులు ఖరారు చేస్తామని అన్నారు. ఈనెల 16న నూతన మద్యం లైసెన్సుదారులు దుకాణాలు ప్రారంభించవచ్చన్నారు. బుధవారం రాత్రి నాటికి వచ్చిన దరఖాస్తులు 2879 ఉన్నాయని డిప్యూటీ కమిషనర్ వెల్లడించారు. స్టేషన్ల వారీగా చూసుకుంటే.. శ్రీకాకుళం 32 షాపులకు 736, ఆమదాలవలస 13 కి 244, రణస్థలం 15కి 435, పొందూరు 10కి 233, నరసన్నపేట 12కి 140, కొత్తూరు 7కి 142, పాతపట్నం 8కి 136, టెక్కలి 11కి 116, కోటబొమ్మాళి 15కి 160, పలాస 15కి 137, సోంపేట 12కి 204, ఇచ్ఛాపురం 8 షాపులకు 196 దరఖాస్తులు నమోదయ్యాయన్నారు. వీటిల్లో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 14 షాపులకుగాను 235, మున్సిపాలిటీ పరిధిలో 13కి 189, మండలాల పరిధిలో 131 షాపులకు 2455 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో డీసీతో పాటు జిల్లా ఎక్సైజ్ అధికారి సిహెచ్ తిరుపతినాయుడు, సీఐ ఎం.వి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీ శ్రీకాంత్‌రెడ్డి

తొలిగా.. అక్షరాల పండగ



దసరా పవిత్ర ఘడియల సందర్భంగా బుధవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో ఇలా పిల్లలు తొలిగా అక్షరాలు దిద్దారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

అమ్మకు కానుక.. ఊరంతా వేడుక



బైపల్లి గ్రామంలో కొలువుదీరిన దుర్గా దేవిని స్థానికులు తమ ఇంటి ఆడపడుచులా భావించి సారె సమర్పించారు. అరిసెలు, బూరెలు, గారెలు, పంచదార చిలకలు, లడ్డూలు, ఇతర పిండి వంటలతో పాటు సంప్రదాయం ప్రకారం కావిడితో ఊరేగించి సారెను అందజేశారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



ఒకప్పుడు దసరా వేళల్లో వేషధారణలు కనిపించేవి. బడుల్లో కూడా పిల్లలు సరదాగా వేషాలు కట్టి అలరించేవారు. కాలక్రమంలో ఆ అలవాటు కనుమరుగైపోయింది. మళ్లీ ఇన్నాళ్లకు కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి హైస్కూల్‌లో బుధవారం పిల్లలు సరస్వతీ పూజ చేసి, అనంతరం దసరా వేషాలు వేసి వీధుల్లో సందడి చేశారు. వీరిని చూసిన పెద్దలు తమ బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు.

– కోటబొమ్మాళి

విగ్రహం.. అనుగ్రహం

వినాయక విగ్రహాలు, దేవీ విగ్రహాలు పెట్టి పూజలు చేయడం అందరికీ తెలుసు. కానీ సరస్వతీ మాత విగ్రహాలు పెట్టి పూజలు చేయడం మీకు తెలుసా..? అది కూడా ఏడాదికొకరు చొప్పున విగ్రహాలు ఏర్పాటు చేస్తారని ఎన్నడైనా విన్నారా..? 2035 వరకు ఆ ఊరిలో విగ్రహాలు ఏర్పాటు చేయబోయే వారి పేర్లు ఖరారైపోయాయని చెబితే నమ్ముతారా..? నమ్మి తీరాల్సిందే. వంద గిరిజన కుటుంబాలు ఉండే చిన్నమల్లిపురంపై చదువుల తల్లి ఆశీస్సులు మెండుగా ఉన్నాయి. అక్కడ మాత విగ్రహం పెడితే కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని నమ్ముతారు.



చిన్న మల్లిపురం గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ సరస్వతిదేవి విగ్రహం

- సరస్వతీ దేవిని పూజిస్తున్న చిన్నమల్లిపురం గిరిజనులు
- తల్లిని పూజిస్తే ఉద్యోగం వస్తుందని నమ్మకం

పాతపట్నం:

సరస్వతీ దేవి విగ్రహం ఆ గిరిజనానికి ఓ లక్ష్యాన్ని నిర్దేశిస్తోంది. సరస్వతీ మాత ఉపాసన ఆ లక్ష్యాన్ని ఛేదించే మార్గాన్ని చూపిస్తోంది. విగ్రహం పెడితే ఉద్యోగం వస్తుందనేది నమ్మకమే అయినా.. విగ్రహం పెట్టాక కష్టపడాలనే తపన రావడం ఆ ఊరికి మేలు చేస్తోంది. గ్రామంలో సుమారు 100 జన కుటుంబాలు ఉంటే దాదాపు 90 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఈ ఊరిలో గత నలభై ఏళ్లుగా సరస్వతిదేవి పూజ నిర్వహిస్తున్నారు. ఏడాదికొకరు విగ్రహాలు పెట్టే సంప్రదాయం ఉంది. ఎవరు విగ్రహాన్ని పెడతారో ఆ ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని వారు నమ్ముతారు. ఆశ్చర్యకరంగా అలాగే వస్తున్నాయి కూడా. ఈ ఏడాది గ్రామానికి చెందిన కొత్తూరు అప్పలస్వామి వ్యవసాయశాఖ ఉద్యోగి సరస్వతిదేవి విగ్రహదాత అందించారు. 2035 సంవత్సరం వరకు విగ్రహదాతల పేర్లు ఖరారైపోయాయంటే అతిశయోక్తి కాదు. ఈ సరస్వతీ దేవి పూజా విధానం వల్లనే తమ గ్రామం బాగు పడిందని, పంచాయతీ ఎన్నికలు కూడా ఏకగ్రీవం అవుతున్నాయని, ప్రజల్లో చైతన్యం వచ్చి చదువుకు ప్రాధాన్యమిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.



చిన్నమల్లిపురం గ్రామం



సరస్వతీ దేవిని పూజించడం వల్లే..



నేను నిరుద్యోగిగా ఉన్నప్పుడు మా గ్రామంలో సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు చేసి పూజించ డం వల్లే నాకు ఉద్యోగం వచ్చిందని నమ్ముతు న్నా. అప్పటి నుంచి ఇప్పుడు కూడా పూజలు కొనసాగిస్తున్నాం. గత 20 ఏళ్లుగా సరస్వతీదేవి పూజల్లో పాల్గొంటున్నాం. – మల్లిపురం శ్రీనివాస్, ఉపాధ్యాయుడు

ఇంటికో ఉద్యోగం వస్తోంది..



మా గ్రామంలో అందరం కలిసి సరస్వతీ దేవీ విగ్రహం ఏర్పాటు చేసి పూజిస్తాం. దేవీ విగ్రహం పెట్టడం నాకు రైల్వేలో ఉద్యోగం వచ్చిందని నా నమ్మకం. అందుకే ఏటా పూజలో పాల్గొంటాను.

– కొంకాడ సింహాచలం, రైల్వే ఉద్యోగి, చిన్నమల్లిపురం గ్రామం

అందరూ ఆ తల్లి బిడ్డలే



మాది గిరిజన గ్రామమైనా అందరూ చదువుకోవాలని తపిస్తాం. రెండు సార్లు గ్రామంలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేశాను. నాకు, నా తమ్ముడుకి ఉద్యోగాలు వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు దేవీ పూజను గ్రామంలో ఘనంగా నిర్వహిస్తు, పూజల్లో పాల్గొంటున్నాం. – పొట్టడి కృష్ణారావు, ఉపాధ్యాయుడు

దసరా.. ఊరికో సరదా



రత్తకన్న గ్రామం

విజయదశమి నాడు దసరా చేసుకోవడం అందరికీ ఆనవాయితీ. కానీ కొన్ని పల్లెలు మాత్రం కొంచెం ముందుగా, కాస్తంత వెనుకగా ఆ వేడుక చేసుకుంటాయి. – ఇచ్ఛాపురం రూరల్

పోలాల అమావాస్య తర్వాత

మండపల్లి, బద్దేపుపేట, భవానీపురం, ఎం.తోటూరు, దేవులమద్రి, లక్ష్మీపురం, మునిబద్ర గ్రామాలను 'సెవెన్ సిస్టర్స్ విలేజెస్' అంటారు. ఇందులో మునిబద్ర ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామం అయినప్పటికీ వీటిని జంట గ్రామాలుగా పిలుస్తారు. ఈ గ్రామాలతో పాటు పక్కనే ఉన్న రత్తకన్న గ్రామస్తులు సైతం ముందస్తు దసరాలు జరుపుకుంటారు. పోలాల అమావాస్య తర్వాత వచ్చే మంగళవారం నాడు 'దొంగ దసరా' పేరుతో కుటుంబ సభ్యులు, బంధువులతో పండగ జరుపుకుంటారు.

ఒక్కరోజు ముందు..

మండలంలోని మండపల్లి, బుద్దేపుపేట, భవానీపురం, ఎం.తోటూరు, దేవులమద్రి, లక్ష్మీపురం, మునిబద్ర గ్రామాలతో పాటు రత్తకన్న, లొద్దపుట్టి, అయ్యవారిపేట, జగన్నాథపురం జంట గ్రామాల ప్రజలు 'దసరా'కు ముందు ఒక్క రోజు 'దొంగ దసరా' పేరుతో ఈ ఉత్సవాన్ని తరతరాలుగా జరుపుకుంటూ వస్తున్నారు.



ఎం.తోటూరు గ్రామంలో దసరా వేడుకలు



లొద్దపుట్టి గ్రామం

దసరా తర్వాత..

లొద్దపుట్టి, అయ్యవారిపేట, జగన్నాథపురంతో పక్కనే ఉన్న ఒడిశా సవరదేవిపేట గ్రామాలు జంట గ్రామాలు. ఈ గ్రామ ప్రజలు దసరా తర్వాత వచ్చే మంగళవారం నాడు 'దొంగ దసరా' పేరుతో ఉత్సవాలు జరుపుకుంటారు. గ్రామ దేవతలను పూజించడం, జంతువులను, కోళ్లను బలులు ఇవ్వడం వంటి ఆచారాలతో ఘనంగా దసరా ఉత్సవాన్ని జరుపుకుంటుంటారు.

తరాలుగా వస్తున్న ఆచారం



మాది మండపల్లి గ్రామం. తరతరాలుగా 'దొంగ దసరా' పేరుతో మేము ముందస్తుగా వచ్చే మంగళవారం దసరా ఉత్సవాలు జరుపుకుంటున్నాం. మా ఇంటి ఆడపడుచులు, కోడళ్లు, కుటుంబ సభ్యులమంతా ఆనందంగా ఈ ఉత్సవాన్ని చేసుకుంటున్నాం.

– పాతిర్ల వల్లభరావు, మండపల్లి గ్రామం

తక్కువ దిగుబడి.. తగ్గిన రాబడి



- దోబూచులాడుతున్న కొబ్బరి ధర
- వారం రోజులుగా నిలిచిన కొనుగోళ్లు
- దారుణంగా పడిపోయిన దిగుబడులు
- ఉత్తరాదికి నిలిచిన ఎగుమతులు
- ఒడిశా మార్కెట్ పైనే ఆధారం



కంచిలి:

ఉద్దానం కొబ్బరితో ధర దోబూచులాడుతోంది. నెల రోజుల నుంచి ధరల్లో స్థిరీకరణ లేకపోవడంతో హెచ్చుతగ్గులతో రైతులతో పాటు వ్యాపారుల్లోనూ అయోమయ పరిస్థితి నెలకొంది. ఉత్తరాంధ్రలోనే ప్రముఖంగా ఉండే కంచిలి కొబ్బరి మార్కెట్ కళావిహీనంగా తయారైంది. జిల్లాలోని ఉద్దానం కొబ్బరి కాయలకు ఉత్తరాది రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. కానీ ఇక్కడ ఉద్దానంలో వరుసగా వచ్చిన విపత్తులతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా ఉత్తరాదికి ఎగుమతులు క్రమంగా తగ్గి, పక్కనే ఒడిశా మార్కెట్‌కే పరిమితమైంది. ప్రస్తుతం ఈ పరిస్థితి మరింత దిగజారింది. ఉత్తరాదికి ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయి, పూర్తిగా ఒడిశా మార్కెట్‌మీదే ఆధార పడాల్సిన దుస్థితి నెలకొంది. వారు చెప్పిందే ధరగా పాటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒడిశా వ్యాపారులకు తోటల వద్దే వారికి దిగుమతి అయిన కొద్దిపాటి కాయల్ని రైతులు అమ్ముకుంటున్నారు.

టెక్కలి డివిజన్‌లోని ఉద్దానం ఏడు మండలాలతో పాటు రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం మండలాల్లో కలిపి సుమారు 36వేల ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. వీటి ఎగుమతులన్నీ కంచిలి కేంద్రంగానే సాగుతుండేవి. ఇక్కడి నుంచి ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, పశ్చిమబెంగాల్, హర్యానా, బీహార్, ఒడిశా తదితర రాష్ట్రాలకు కొబ్బరి కాయలు ఎగుమతి చేస్తుండేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కొబ్బరి దిగుబడులు స్థానికంగా తగ్గడం, ఉద్దానం కొబ్బరికి ధీటుగా దక్షిణాదిన ఉండే కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా కొబ్బరి సాగు వృద్ధి చెందింది. దీంతో ఉత్తరాది రాష్ట్రాలు కొబ్బరిని కొనుగోలు చేసేటప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న అన్ని మార్కెట్‌లను పరిశీలిస్తున్నారు. ఇక్కడ దిగుబడులు తగ్గడంతో దక్షిణాది రాష్ట్రాలు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి కొంటున్నారు.

ప్రస్తుతం ఒడిశా వ్యాపారులు రూ.20 వేల వరకు ఎంపిక చేసిన కాయల్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల మొదటివారంలో వెయ్యి కాయల ధర రూ.16వేలు వరకు పలికేది. వారం రోజుల కిందట కురిడి కాయలకు ఉత్తరాదిలో డిమాండు ఏర్పడటంతో స్థానికంగా కొబ్బరి ధర అమాంతంగా రూ.20 వేలు వరకు పెరిగింది. తాజాగా ఆ ధర మళ్లీ తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడు మళ్లీ రూ.16వేలు మాత్రమే కంచిలి వ్యాపారులు కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. దీనికి రైతులు ససేమిరా అంటున్నారు. ఒడిశా వ్యాపారులకే సరకు ఇస్తామని చెబుతున్నారు. కానీ ఒడిశా వ్యాపారులు మాత్రం అన్ని రకాల సైజులున్న కాయల్ని కొనుగోలు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు.

రైతుల్లో నిస్తేజం..



కొబ్బరి దిగుబడులు ఎకరాకు కేవలం 200 నుంచి 250 మాత్రమే వస్తున్నాయి. గతంలో ఒక ఎకరాకు 800 కాయలు దిగుబడి వచ్చేవి. అలాంటిది పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో రైతు దిగాలు చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– వజ్జ మృత్యుంజయరావు, కొబ్బరి రైతు, మకరాంపురం గ్రామం

ఇసుక దోపిడీలో కొత్త కోణం



జే.ఆర్.పురంలో తప్పుడు రశీదుతో చిక్కిన లారీ

రణస్థలం: ఇసుక దోపిడీలో రోజుకో కొత్త కోణం బయటపడుతోంది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమాలకు అనేక దారులు వెతుకుతోంది. తాజాగా పైడిభీమవరం ఇసుక చెక్‌పోస్టు వద్ద బుధవారం ఇసుక లారీ తనిఖీ చేసిన సమయంలో ఇసుక దోపిడీలో కొత్త కోణం బయటపడింది. ఏపీ31టీహెచ్ 8259 నంబర్ గల లారీ ఇసుక రశీదులను డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీదేవి తనిఖీ చేశారు. ఈ ఇసుక లారీ ఒడిశాలోని జైపూర్ సర్కిల్ పరిధిలోని గుణపూర్ శాండ్ బెడ్-2 నుంచి తీసుకువస్తున్నట్లు రశీదులో పేర్కొని ఉంది. రశీదుపైన ఉన్న లారీ నంబర్ ఇసుకతో వచ్చిన లారీ నంబర్ సరిపోయింది. అయితే బార్ కోడ్ యాప్‌లో ఇసుక రశీదు స్కాన్ చేస్తే మాత్రం మరో లారీ నంబర్ ఏపీ 39డబ్ల్యూ 8269 చూపించింది. దీంతో లారీని జేఆర్ పురం పోలీసులకు రెవెన్యూ డీటీ శ్రీదేవి అప్పగించారు. ఇలాగే నకిలీ బిల్లులతో వందలాది లారీలు విశాఖ వైపు వెళ్తున్నాయా.. అని అధికారులే ఆశ్చర్యపోయారు. దీనిపై జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి మాట్లాడుతూ ఇసుక లారీని పట్టుకున్నామని, అయితే లారీ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పుగా పడిందని చెబుతున్నారని తెలిపారు. ఒడిశా మైన్స్ అండ్ జియోలాజీ వారితో సంప్రదిస్తున్నామని ఇంకా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

పురాతన విగ్రహాల గుర్తింపు

సారవకోట: మండలంలోని అంగూరు గ్రామంలో గల కుంభేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పురాతన రాతి విగ్రహాలను పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి గుర్తించారు. ఇటీవల పర్యాటకాధికారి నారాయణరావు సారవకోట, జలుమూరు మండలాలలోని ఆలయాలు, ప్రదేశాలను సందర్శించిన సమయంలో అంగూరులో ఈ విగ్రహాలను గుర్తించారు. ఈయనిచ్చిన సమాచారం మేరకు శివనాగిరెడ్డి విగ్రహాలను పరిశీలించగా అరుదైన బ్రహ్మీ విగ్రహంగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. తూర్పు గాంగుల కాలంలో జనాదరణ చవిచూసిన సప్తమాతృకారాధనను సూచిస్తున్నాయన్నారు. ఈ బ్రహ్మీ విగ్రహం సరస్వతీదేవి రూపాన్ని ప్రతిబింబిస్తూ వీణను మీటుతూ హంసవాహినిగా ఉందని వివరించారు. ఈ విగ్రహాలు వేయి ఏళ్ల కిందటివి అయి ఉంటాయని తెలిపారు.



అంగూరు కుంభేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న బ్రహ్మీ విగ్రహాలు

తిమడాంలో టీడీపీ నాయకుల అరాచకం

జలుమూరు: తిమడాం గ్రామంలో టీడీపీ నాయకులు వెలమల చంద్రభూషణరావు, రమేష్, మధులు గ్రామానికి చెందిన బాబూరావు, రమణమ్మల ఇంటిని మంగళవారం అర్ధరాత్రి యంత్రాలతో కూల్చివేయించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. 90 ఏళ్ల నుంచి ఇదే ఇంటిలో గొడెయా కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఉంటున్నారు. కృష్ణమూర్తి కొన్నేళ్ల కిందట చనిపోగా.. ఇటీవల ఆయన భార్య అమ్మన్నమ్మ కూడా మృతి చెందారు. దీంతో అదే ఇంటిలో అల్లుడు బాబూరావు, కుమార్తె రమణమ్మలు నివాసం ఉంటూ టిఫిన్ బండి నడుపుతున్నారు. గత ప్రభుత్వంలో వీరికి ఇంటి పట్టా కూడా ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం వచ్చింది మొదలు వీరికి కష్టాలు మొదలయ్యాయి.

వీరు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు వీరిపై గుర్రుగా ఉన్నారు. అధికారం చేతికి వచ్చినప్పటి ఉంచి వీరి ఇల్లు తొలగించడానికి నానా ప్రయత్నాలు చేసి వివాదం కోర్టులో ఉన్నందున ఏం చేయలేకపోయారు. ఇప్పుడు అర్ధరాత్రి పూట ఇంటిని కూల్చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.



తిమడాంలో తొలగించిన ఇంటి ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న బాబూరావు, రమణమ్మ

'సాక్షం'కు 153 అంగన్‌వాడీల ఎంపిక

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీలు మరింత సమర్థంగా పనిచేయాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ పథక సంచాలకులు బి.శాంతిశ్రీ అన్నారు. శ్రీకాకుళంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని 16 ప్రాజెక్టుల పరిధిలోగల సీడీపీఓలు, ఏసీడీపీఓలు, సూపర్‌వైజర్‌లకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిశ్రీ మాట్లాడుతూ సాక్షం అంగన్‌వాడీ కింద జిల్లాలో 153 అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో 'పోషణ్ వాటిక' ఆర్గానిక్ ఫార్మింగ్ పద్ధతిలో ఏర్పాటు చేసుకునే విధానాన్ని వివరించారు.

క్లుప్తంగా

హెచ్‌పీసీఎల్‌తో స్కిల్ డెవలప్‌మెంట్ ఒప్పందం

శ్రీకాకుళం రూరల్: నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చే క్రమంలో భాగంగా హెచ్‌పీసీఎల్‌తో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఒప్పందం కుదుర్చుకుందని బొల్లినేని మెడిస్కిల్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఐదు కోర్సులకు గాను జనరల్ డ్యూటీ అసిస్టెంట్, బ్రైడల్ ఫ్యాషన్ అండ్ పోర్ట్ పోలియో మేకప్ ఆర్టిస్ట్, ఫుడ్ అండ్ బేవరేజీస్ సర్వీస్ అసోసియేట్, వేర్ హౌస్ డేటా ఫీడర్, ప్రొడక్షన్ మెషిన్ ఆపరేటివ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సులకు పదోతరగతి, ఐటీఐ చదివిన యువతీ యువకులు 18 నుంచి 28 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. మూడు నెలలు ఉచిత శిక్షణ ఉంటుందని, భోజన సదుపాయాలు ఉంటాయన్నారు.

శభాష్ వసంత



జి.సిగడాం: ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీలో జి.సిగడాం మండలం పెంట గ్రామానికి చెందిన డోల వసంతరావు ప్రతిభ చాటారు. తెలుగు ఉపాధ్యాయునిగా గ్రేడ్ -1 విభాగంలో తెలంగాణ రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించారు. గ్రేడ్ -2 విభాగంలోనూ రాష్ట్రస్థాయిలో 3 వ ర్యాంకు సాధించారు. హైదరాబా ద్ డీఈఓ కార్యాలయం నుంచి సమాచారం రావడంతో అక్కడకు బయల్దేరి వెళ్లారు.

ఆదిత్యుడిని దర్శించుకున్న రిటైర్డ్ డీజీపీ



రిటైర్డ్ డీజీపీ సుధాకర్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సిక్కిం రిటైర్డ్ డీజీపీ అత్తిలి సుధాకరరావు, యామిని దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ విశిష్టతను వివరించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచారి తదితరులున్నారు.


అన్న క్యాంటీన్‌లో కలెక్టర్ భోజనం



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న కలెక్టర్, జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శ్రీకాకుళంలోని అన్న క్యాంటీన్‌లో బుధవారం మధ్యాహ్నం భోజనం చేశారు. జిల్లా కేంద్రంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి క్యూలో సామాన్యుడిలా నిలబడి భోజనం రుచి చూశారు. అక్షయ పాత్ర నిర్వాహకులను పలు ప్రశ్నలు అడిగి కొన్ని సూచనలు చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న అప్పన్న

ఎల్.ఎన్.పేట: మండలంలోని బసవరాజుపేట షెడ్ సమీపంలో అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డుపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బసవరాజుపేట గ్రామానికి చెందిన సిద్ధాంతం అప్పన్నకు బలమైన గాయాలయ్యాయి. బసవరాజుపేట గ్రామానికి చెందిన అప్పన్న మంగళవారం రాత్రి సమీపంలో ఉన్న స్కాట్‌పేటలో పాలకేంద్రంలో పాలు ఇచ్చి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో అప్పన్నకు గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అప్పన్న పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

హ్యాండ్‌బాల్‌లో సిక్కోలు భళా

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో శ్రీకాకుళం జైత్రయాత్ర కొనసాగుతోంది. రాజమండ్రి వేదికగా ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) అండర్-17 బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం బాలురు జట్టు రన్నరప్‌గా నిలిచింది. జిల్లా జట్టు రాణింపుపై డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, మెట్ట తిరుపతిరావు, గురుగుబెల్లి రాజశేఖర్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఇదేం న్యాయం..?

- తమ ఉద్యోగాల తొలగింపుపై 31 మంది ఆందోళన
- రాష్ట్రంలో ఎక్కడా లేని రూల్స్ ఇక్కడే ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్న



డీఎంహెచ్ఓ కార్యాలయం

అరసవల్లి: మూడేళ్ల కిందట అన్యాయంగా తమను ఉద్యోగాల నుంచి తీసేశారని, కేవలం ఉన్నతాధికారుల వల్లనే తమ కొలువులు పోయాయని, అప్పటి నుంచి పోరాడుతున్నా కీలక అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని వైద్య శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో కోవిడ్ కాలం, ఆ తర్వాత సమయాల్లో జరిగిన ఉద్యోగాల నియామకం, తొలగింపుల్లో 31 మంది అన్యాయమైపోయారు. అప్పటి నుంచి వారు ఈ సమస్యపై పోరాడుతూనే ఉన్నారు.

అసలేం జరిగిందంటే..

జిల్లాలో నిహాల్ ఏజెన్సీ (మొదటి కాంట్రాక్ట్) ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలో 2020 మే నెలలో ఉన్న ఖాళీల మేరకు తాత్కాలికంగా మొత్తం 71 పోస్టులను భర్తీ చేశారు. ఇందులో 21 పోస్టులను డీఎంహెచ్ఓ పరిధిలోని పీహెచ్‌సీల్లో భర్తీ చేస్తే.. మిగిలిన 50 పోస్టులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఏపీ వైద్యవిధానపరిషత్, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో కేటాయించారు. అలాగే 2020 జూలైలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ విధానంలో సుమారు 330 మందిని జిల్లాలో వైద్యులతో పాటు ఎఫ్ఎన్‌ఓలు, ఎంఎన్‌ఓలు, తదితర స్టాఫ్‌లను నియమించారు. ఇవన్నీ తాత్కాలిక నియామకాలేనని, తర్వాత అందరినీ తొలగించేస్తామని ముందుగానే చెప్పి నియమించుకున్నారు. నిబంధనల మేరకు వీరంతా ఏడాది పనిచేసి వెళ్లిపోయారు. సెప్టెంబర్ 2021లోనే వీరి తొలగింపులు కూడా జరిగిపోయాయి. అయితే అదే సమయంలో 21 మంది నర్సింగ్ సిబ్బందిని, మరో 10 మంది అదనపు సిబ్బందిని నిహాల్ ఏజెన్సీ రెండో కాంట్రాక్ట్ ద్వారా నియమించేలా జీఓ 62, జీఓ 60లను వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జారీ చేశారు. వీరిని శాశ్వత ఔట్‌సోర్సింగ్ కింద గుర్తించాలని, వీరిని తొలగించేందుకు లేదని అప్పట్లోనే ప్రభుత్వం సూచించింది. కానీ జిల్లా అధికారులు మాత్రం గుంపగుత్తగా ముందుగా నియమించిన 71 మంది, ఆ తర్వాత వచ్చిన 330తో కలిపి వీరిని కూడా ఉద్యోగాల నుంచి తీసేశారు. వాస్తవానికి జీఓ 60, 62 ద్వారా నియమితులైన వారిని రాష్ట్రంలో ఎక్కడా తొలగించలేదు. కానీ మన జిల్లాలో మాత్రం తొలగించడంతో వీరు ఆందోళన చేశారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించామని, తమను శాశ్వత సిబ్బందిగా నియమిస్తే ఎలా తొలగిస్తారంటూ ప్రశ్నించారు. కానీ వారు మొర విన్నవారే లేకపోయారు.

కోర్టును ఆశ్రయిస్తే..

తమకు జరిగిన అన్యాయంపై వీరంతా కోర్టును ఆశ్రయించారు. తాము 2020 జూన్‌లో కోర్టును ఆశ్రయిస్తే.. ప్రతివాదులు నియామకాల సమయంలోని నోట్ ఆర్డర్‌ను మార్చేసి కోర్టుకు సమర్పించినట్లు వారు ఆరోపిస్తున్నారు. దీంతో తమ నియామకాల సమయంలోని నోట్ ఆర్డర్‌ను సమాచార హక్కు చట్టం కింద ఇవ్వాలంటూ గత 27న అడిగితే ఇంతవరకు జిల్లా వైద్యారోగ్య శాఖ నుంచి స్పందనే లేదని వారు చెబుతున్నారు. కేవలం తమ స్వలాభం కోసం తమ నియామకాలను ఫేక్ ఆర్డర్లుగా చూపించే ప్రయత్నం చేసి తమ వారిని నియమించుకునేలా పావులు కదుపుతున్నారని ఆరోపించారు. దీని వెనుక ఓ కీలక అధికారి ఉన్నట్లు చెబుతున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని తమ సమస్య పరిష్కరించాలని బాధితులు తండ్యాల సుధాబాబు, రూపవతి, కుమారి, అచ్యుతరావు, బండి రమాదేవి తదితర కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.



డీఎంహెచ్ఓ గది ముందు కోర్టు ఆదేశాల పత్రాలను చూపిస్తున్న బాధితులు సుధాబాబు తదితరులు

నిరాహార దీక్షలకు సిద్ధం

మాకు అన్యాయం జరిగింది. కేవలం మౌఖిక ఆదేశాల ప్రకారం ఎలాంటి రిటన్ ఆర్డర్ లేకుండా మమ్మల్ని తొలిగించారు. డీఎంహెచ్ఓ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్, డీఎంహెచ్ఓ మీనాక్షి తదితరులు న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇందుకు నిరసనగా త్వరలో డీఎంహెచ్ఓ కార్యాలయం ముందే నిరాహార దీక్షలకు దిగుతాం.

– తండ్యాల సుధాబాబు, బాధితుడు (ఎంఎన్ఓ)

ఆస్పత్రిలో పనిచేయని స్కానింగ్ మిషన్

- నరసన్నపేటలో తప్పని ఇబ్బందులు
- రెండు నెలలుగా ఇదే పరిస్థితి



పనిచేయని స్కానింగ్ మిషన్

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు తనిఖీలు చేసే స్కానింగ్ మిషన్ పనిచేయడం లేదు. దీంతో రెండు నెలల నుంచి తనిఖీలు నిలిపేశారు. నెలవారీతో పాటు మూడు, ఐదు, ఏడు నెలలకు విధిగా గర్భిణులకు తనిఖీలు చేస్తుంటారు. గర్భంలో బిడ్డ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనేది ఈ స్కానింగ్ ద్వారానే తెలుస్తుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ స్కానింగ్ మిషన్ వినియోగంలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఇది పనిచేయక పోవడంతో సరైన రిపోర్టులు రావడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో గర్భంలో బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొనేందుకు ప్రైవేటుగా స్కా నింగ్ చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో పేద గర్భిణుల బంధువులకు చేతి డబ్బులు ఖర్చు అవుతున్నా యి. ఉచితంగా స్కానింగ్ అవుతుందని ప్రభుత్వాస్పత్రికి వస్తే ఈ విధంగా బయట స్కానింగ్ చేసుకోమని సూచించిడంపై పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆస్పత్రిలో స్త్రీ వైద్య విభా గం ఇన్‌చార్జి డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ స్కానింగ్ మిషన్ పనిచేయక పోవడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. జిల్లాతో ఇతర ప్రభుత్వాస్పత్రులతో పోల్చితే నరసన్నపేటలో ప్రసవాల సంఖ్య అధికమని, ఈ సమస్యను ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబుతో పాటు పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



జగదీశ్వరరావుకు గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహిస్తున్న సిబ్బంది

నందిగాం: దసరా పండుగకు ఇంటికి వస్తూ ప్రమాదవశాత్తు రైలు నుంచి పడిపోయి మృతి చెందిన ఎస్ఎస్‌బీ జవాన్ గంటా జగదీశ్వరరావు(36) మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. కోల్‌కతా నుంచి విశాఖపట్నంకు విమానంలో అక్కడ నుంచి సీఆర్‌పీఎఫ్ వాహనంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మృతదేహాన్ని నందిగాం తరలించారు. ఉదయం స్థానిక ఉన్నత పాఠశాల నుంచి యువకులంతా కలిసి ర్యాలీగా మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. జగదీశ్వరరావు మృతదేహాన్ని భార్య శోభారాణి, పిల్లలు జయవర్ధన్, చాందినీ మిగతా కుటుంబసభ్యులు కడసారి చూశాక అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని తండ్రి త్రినాథరావు ఐదేళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందగా, తల్లి ప్రభావతి ఐదు నెలల కిందట తీర్థయాత్రలకు వెళ్లి అక్కడ చనిపోయారు. ఇప్పుడు జగదీశ్వరరావు మృతితో ఆ కుటుంబంలో శోకసంద్రంలో మునిగిపోయింది.

వైఎస్సార్ సీపీ నాయకుల బాధ్యతల స్వీకరణ నేడు



సభా వేదికను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నరసన్నపేట: జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ నాయకత్వంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నాయకులకు దిశానిర్దేశం చేస్తూ.. పార్టీ జిల్లా అధ్యక్షునిగా ధర్మాన కృష్ణదాస్‌ను, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం పరిశీలకునిగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంలను నియమించారు. ఇటీవల మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా నియమించారు. వీరందరూ గురువారం నరసన్నపేటలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో సభా వేదికను ఏర్పాటు చేశారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు గుప్త, చింతు రామారావు, సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు తదితరులు సభా వేదిక ఏర్పాట్లను సమీక్షించారు.

వర్సిటీలో సీఏఎస్ కమిటీ ఏర్పాటు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సీఏఎస్ (కెరియర్ అడ్వాన్స్ స్కీమ్) కమిటీ ఏర్పాటు చేస్తూ రిజిస్ట్రార్ పి.సుజాత ఈ నెల 4వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ ద్వారా సీనియర్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పదోన్నతులు కల్పించనున్నారు. రెగ్యులర్ ఫ్యాకల్టీకి ఈ స్కీమ్ వర్తించనుంది. ఈ కమిటీలో సబ్జెక్టు నిపుణులుగా ఆంధ్రా విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విశ్రాంత ప్రొఫెసర్ డి.శ్రీరామిరెడ్డి, కాకినాడకు చెందిన జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎం.రమేష్, ఏయూకి చెందిన కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ పి.అర్జున్, గుంటూరుకు చెందిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కె.ధనలక్ష్మిలను నియమించారు. విద్యార్హతలు, సర్వీస్, ఇతర నిబంధనలు, అర్హతలు ఆధారంగా కమిటీ సభ్యులు విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించి ఉద్యోగోన్నతికి సిఫార్సు చేస్తారు. వర్సిటీలో ప్రస్తుతం ఈ కమిటీ పరిధిలోకి బయోటెక్నాలజీ ప్రొఫెసర్ సుజాత వస్తారు. ఈమె రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు. సోషల్ వర్క్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా అనురాధ, కావ్యజ్యోత్స్న, బయోటెక్నాలజీలో ఉదయ్‌భాస్కర్, స్వప్నవాహిణి, లోకేశ్వరి ఉన్నారు. కాంట్రాక్టు బోధకులతోనే వర్సిటీలో విద్యాబోధన కొనసాగుతోంది. ఈ నెల 28న కమిటీ ముందుగా అర్హతల పరిశీలన నిర్వహిస్తారు. అర్హత ఉన్న వారికి తర్వాత ఇంటర్వ్యూలు చేస్తారు. ప్రస్తుతం సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్లు ఉన్నత విద్యా మండలి నిలిపివేసింది. ఈ నేపథ్యంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. డైరెక్ట్‌గా నోటిఫికేషన్ ద్వారానే సీనియర్ ప్రొఫెసర్లను నియమించాలనే నిబంధనలు వర్సిటీలో అమలు చేస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లు ఉద్యోగోన్నతికి సంబంధించి సైతం 2023లో సీఏఎస్ కమిటీ వేశారు. అప్పట్లో ఒక్కరికి మాత్రమే అర్హత ఉన్నట్లు స్క్రూటినీలో గుర్తించారు. ఇంటర్వ్యూలు మాత్రం నిర్వహించలేదు. దీంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు.

మద్యం తాగవద్దు అన్నందుకు..

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం పంచాయతీ కొత్త కూర్మినాయుడుపేట గ్రామానికి చెందిన జీరు పరసయ్య (64) మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన మద్యానికి బానిసైపోవడంతో తరచూ కుటుంబ సభ్యులు మందలించే వారు. కొంతకాలంగా ఇదే విషయంపై ఇంటిలో వాగ్వాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆయన బుధవారం క్షణికావేశంలో పురుగు మందు తాగేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు అసిరి నాయుడు ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పోలాకి: స్థానిక ఆస్పత్రి కూడలి వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెలమర గ్రామానికి చెందిన గొర్లె చిన్నారావు(60) మృతి చెందినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. నరసన్నపేట నుంచి పిన్నింటిపేట వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఆటోలో డ్రైవర్ పక్క సీట్‌లో కూర్చున్న చిన్నారావుకు బలంగా దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండు ఆటోలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో యువకుడు మృతి



ఆస్పత్రిలో తేజేశ్వరరావు మృతదేహం

కొత్తూరు: వసప గ్రామానికి చెందిన కొయిలాపు తేజేశ్వరరావు (34) పాము కాటుకు గురై మృతి చెందాడు. తేజేశ్వరరావు తన పశువులకు పచ్చగడ్డి కోసం బుధవారం పొలానికి వెళ్లాడు. గడ్డి కోస్తుండగా పాము కాటువేసింది. వెంటనే స్థానిక సీహెచ్‌సీకి వెళ్లినా ఫలితం లేకపోయింది. అక్కడ వైద్యం పొందుతూ తేజేశ్వరరావు చనిపోయాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. తేజేశ్వరరావు మృతి చెందడంతో కుటుంబానికి ఆధారం పోయింది.

వనవిష్ణుపురంపై పోలీసు నిఘా



వనవిష్ణుపురంలో బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసులు

పోలాకి: గ్రామదేవత పండగ నేపథ్యంలో జరిగిన వివాదం ముదిరి ఒక వ్యక్తి మృతికి కారణమైంది. దీంతో పోలాకి మండలం వనవిష్ణుపురం గ్రామం ఖాకీవనంలా మారింది. వందల మంది పోలీసులను గ్రామంలో పికెటింగ్‌కు తరలించారు. మృతుడు పాలిన వీరాస్వామి అంత్యక్రియలు బందోబస్తు మధ్య నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు సిబ్బందితో గ్రామంలో గస్తీ కాస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే పాలిన కృష్ణమూర్తితో సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మరి కొందరు పరారీలో ఉన్నారు. ఘటనను రాజకీయ హత్యగా చిత్రీకరించేందుకు టీడీపీ ప్రయత్నిస్తున్నప్పటికీ.. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రజలు సంయమనం పాటించాలని పూర్తి స్థాయి విచారణ తర్వాత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలియజేశారు.

కాలువలో అనధికార గోడ నిర్మాణం



మందసలో ఇరిగేషన్ కాలువ కుదించి అనుమతులు లేకుండా కట్టిన గోడ

కాశీబుగ్గ: మందస మేజర్ పంచాయతీలో సాగునీటి కాలువను ఆక్రమించి అక్రమంగా గోడ నిర్మిస్తున్నారు. మందస గ్రామం ప్రారంభంలో ఈతచెరువు ఎదురుగా ఇది వరకు ఓ పెద్ద రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ టీడీపీ వర్గీయులది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో కాలువపై వారి కన్ను పడింది. మందస–హరిపురానికి నీరు ప్రవహించే ఈ కాలువ మందస గ్రామం బోయివీధి శివారులో టీడీపీ నాయకుడు వేసిన వెంచర్ వద్ద ఆక్రమణకు గురైంది. 9 లింకులు ఉన్న కాలువ 3 లింకులకు మార్చేసి దానిపై గోడలు, శ్లాబ్‌లు ఆపై ప్రహరీని నిర్మించుకున్నారు. పక్కనే ఉన్న 211/4 సర్వే నంబర్‌లో జిరాయితీ పట్టాదారులకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కాలువను ఆక్రమించడంతో దిగువ ప్రాంతంలో ఉన్న 1500 ఎకరాలకు నీరు ప్రశ్నార్థకమవుతోంది. అందరూ చిన్న రైతులు కావడంతో టీడీపీ నాయకుడికి ఎదురెళ్లలేకపోతున్నారు. ముందుకు వెళ్లిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టించి ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నిస్తుండటంతో తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. కాలువలో గోడలు కట్టాక నీటి ప్రవాహానికి మూడు అడుగులు మాత్రమే అవకాశం ఉండటంతో ఈ కట్టడాలకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంపై మందస మండల ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు చేపడతామని అన్నారు.

నాలుగు దశాబ్దాల తర్వాత..



సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984-85లో టెన్త్ చదివిన వారు బుధవారం అదే పాఠశాల ఆవరణలో మళ్లీ కలిశారు. తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించి.. నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. – సారవకోట

జెడ్పీ సమావేశం ప్రశ్నలపై సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆస్పత్రులకు సంబంధించి అప్‌గ్రేడేషన్ ప్రతిపాదనలు పంపినట్లు సంబంధిత సభ్యులకు తెలపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యాధికారులను ఆదేశించారు. ఆగస్టు 28వ తేదీన నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన బుధవారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఆమదాలవలస, పాతపట్నం, టెక్కలి, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఆస్పత్రుల ఆధునీకరణపై ప్రశ్నించగా.. ప్రతిపాదనలు పంపించామని డీఎంహెచ్ఓ చెప్పారు. అయితే ఎమ్మెల్యేలకు సమాచారం అందిస్తే వారు సమన్వయం చేసుకుంటారని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ శాఖపై ఎరువుల పంపిణీ, ఎంత ఎరువులు అవసరం ఉందని కలెక్టర్ అడుగగా 13 వేల మెట్రిక్ టన్నుల అవసరం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. రబీపై ఆరా తీశారు. తులగాం ఆర్ఆర్ కాలనీలో ఉపాధి హామీ నియామకాల ప్రకారం గుర్తించాలని డ్వామా పీడీ సుధాకర్‌ను ఆదేశించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూడిజగన్నాథపురం పంచాయతీ తిమ్మలవానిపేటకు చెందిన దుమ్ము లచ్చయ్య (70) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. దీంతో మంగళవారం రాత్రి పురుగు మందు తాగేశారు. గతంలోనూ ఇలాగే ఓ సారి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ సారి మాత్రం చనిపోయారని ఎస్ఐ బుడుమూరు నీహార్ చెప్పారు. లచ్చయ్యకు భార్య రాజమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు.

'ఉద్దానం ఐకాన్' ఆవిష్కరణ



ఐకాన్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురంలో ఉద్దానం పేరుతో ఏర్పాటు చేసిన ఐకాన్‌ను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం ప్రారంభించారు. అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు దేవునల్తాడ వరకు ఉన్న ఉద్దానం ప్రజల ఐక్యతకు చిహ్నంగా ఈ ఐకాన్ ఏర్పాటు చేయడం శుభ పరిణామని మాజీ మంత్రి సీదిరి అన్నారు. ఐకాన్ ఏర్పాటు చేసిన ఉద్దానం రామకృష్ణాపురం యువతను, గ్రామ పెద్దలను అభినందించారు.

ఒడిశాలో పాతపట్నం బీటెక్ విద్యార్థి మృతి



ఒడిశాలో సంఘటన స్థలంలో మృతి చెందిన సోహిత్ కోళి

పాతపట్నం: ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గుసాని బ్లాక్(మండలం) పాటికోట గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నం యశోదనగర్‌కు చెంది సోహిత్ కోళి (22) మృతి చెందాడు. మరో విద్యార్థి రాహుల్ స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం యశోదనగర్‌కు చెందిన సోహిత్ కోళి, దుర్గమ్మకాలనీకు చెందిన రాహుల్‌లు ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నారు. పాతపట్నం నుంచి ఒడిశా యూనివర్సిటీకు వెళ్లి, ఇద్దరూ తిరిగి పాతపట్నం బుల్లెట్‌పై వస్తుండగా ఒడిశాలోని గజపతి జిల్లా గుసాని బ్లాక్ పాటికోట సమీపంలో అతివేగం కారణంగా బండి అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. దీంతో సోహిత్ కోళి అక్కడికక్కడే మృతి చెందగా, రాహుల్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గురండి పోలీసులకు తెలియజేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చేరుకుని పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి, కుటుంబసభ్యులకు తెలియజేశారు. గాయాలపాలైన రాహుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోస్టుమార్టం కోసం మృతదేహం పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రి ఉంచామని ఐఐసీ రవింద్రకుమార్ పాత్రో మీడియాకు తెలిపారు.